నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 7 నవంబర్ 2024 | KHAMMAM

మధిర, వైరా గురుకులాల విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి, ఎంపీ

విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం

- 15 వేల మందితో ఈ నెల 14న మీటింగ్
- అదేరోజు ఫేజ్-2 ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల మంజూరు
- విద్యార్థుల ముఖాముఖిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. వైరా, మధిర నియోజకవర్గాల నుంచి బుధవారం సచివాలయానికి తరలివచ్చిన మహాత్మా జ్యోతిబా పూలే, సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని స్పష్టంచేశారు. చదువుతోపాటు స్కిల్స్ ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ నెల 14న 15 వేల మంది విద్యార్థులతో సమావేశం అవుతానని చెప్పారు. అదేరోజు ఫేజ్-2 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేయనున్నట్టు వెల్లడించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు బలరాంనాయక్, రఘురాం రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి

- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు
- పలు మండలాలు, పట్టణాలకు కన్వీనర్లు, కో కన్వీనర్ల నియామకం


నూతన కమిటీల బాధ్యులతో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు టౌన్, నవంబర్ 6: నిత్యం ప్రజలతో మమేకమై పార్టీని గ్రామ, మండల, జిల్లాస్థాయి వరకు మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. మణుగూరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని, ఆరు గ్యారెంటీలను విస్మరించారని ఆరోపించారు. వాటిని అమలు చేసేంత వరకు ప్రభుత్వాన్ని, మంత్రులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు మండలాలకు కమిటీలను ప్రకటించారు. భద్రాచలం పట్టణ కన్వీనర్‌గా ఆకోజు సునీల్‌కుమార్, కో కన్వీనర్‌గా రేపాక పూర్ణచందర్‌రావు, దుమ్ముగూడెం మండల కన్వీనర్‌గా కణితి రాముడు, కో కన్వీనర్‌గా జానీ, చర్ల మండలం కన్వీనర్‌గా దొడ్డి తాతారావు, కో కన్వీనర్‌గా పవన్‌కుమార్, మణుగూరు మండల కన్వీనర్‌గా కురి నాగేశ్వరరావు, కో కన్వీనర్‌గా బొలివెట్టి నవీన్, మణుగూరు టౌన్ కన్వీనర్‌గా కుంట లక్ష్మణ్, కో కన్వీనర్‌గా రమేశ్‌లను నియమించినట్లు వెల్లడించారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

పోలీసుల మెగా హెల్త్ క్యాంపులో భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, నవంబర్ 6: పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణతో పాటు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. వైద్య పరీక్షల ద్వారా డాక్టర్లు చెప్పే ఆరోగ్య సూత్రాలు విధిగా పాటించాలని అన్నారు. డీఎస్పీ రెహమాన్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు, సిబ్బంది, వారి కటుంబ సభ్యులకు కొత్తగూడెం ఐఎంఏ హాల్లో బుధవారం నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపులో ఎస్పీ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పోలీసులకు శారీర దారుఢ్యం ఉన్నప్పటికీ కొంతమేర మానసిక ఒత్తిడి ఉంటుందని అన్నారు. దీనిని అధిగమించి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అప్పుడప్పుడూ తమ కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులు బాగోలేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సి వస్తోందని అన్నారు. ఈ క్రమంలోనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ప్రముఖ వైద్య నిపుణులు నాగరాజు, కృష్ణప్రసాద్, కంభంపాటి రంగారావు, చారుగుండ్ల రాజశేఖర్, అయ్యప్ప, కృష్ణ, ఎరుక బాబురావు, ప్రవీణ్‌రెడ్డి, స్రవంతి, కల్యాణి, విజయలక్ష్మి, సీఐలు ముప్పారపు కరుణాకర్, కాగితోజు శివప్రసాద్, తొగిట రమేశ్, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌కు కొత్త మిర్చిచ్చొంది..

ఏఎంసీలో కొత్త మిర్చి పంట వద్ద పూజలు చేస్తున్న వ్యాపారులు

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 6: రైతులు వానకాలంలో సాగు చేసిన మిర్చి పంట ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం విక్రయానికి వచ్చింది. కమీషన్ వ్యాపారి బజ్జూరి రమణారెడ్డికి చెందిన రైతు ఎన్.నారాయణరెడ్డి రెండు బస్తాల మిర్చిని అమ్మకానికి తీసుకొచ్చాడు. కార్తీక మాసం తొలి రోజుల్లోనే మార్కెట్‌కు కొత్త మిర్చి పంట రావడంతో కాంటా వద్ద వ్యాపారులు, కార్మికులు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఇకనుంచి మార్కెట్‌కు విక్రయానికి కొత్త మిర్చి రానుండడంతో మరింత సందడిగా మారనున్నది.

అడుగడుగునా అనుమానాలే..

కులవృత్తిదారులు సైతం వార్షికాదాయం వివరాలు సర్వే బృందం సేకరించనుంది. అలాగే 31 నుంచి 40 వరకు ఆయా కుటుంబాలకు ఉన్న భూముల వివరాలను సేకరించనున్నారు. అందులో ధరణి పాస్‌పుస్తకాలతో సహా సేద్యం చేసే భూములు, సేద్యం చేయని పడావు భూములు వివరాలను అడిగారు. రైతుభరోసాను ఐదెకరాల వరకే ప్రభుత్వం వర్తింపజేస్తుందన్న సందేహాల నేపథ్యంలో ఈ వివరాలు అడగడంతో భవిష్యత్‌లో ఐదెకరాలకు పైన ఉన్న రైతులకు రైతుభరోసాలో కోతలు పెట్టే అవకాశం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన 'సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే'
- సవాలక్ష ప్రశ్నలను సంధిస్తున్న సర్వే సిబ్బంది
- సమాధానాలు చెప్పేందుకు సందేహిస్తున్న జిల్లా ప్రజలు
- వ్యక్తిగత విషయాలు ఎందుకని ప్రశ్నిస్తున్న జనం
- ఏ సమాచారం చెబితే ఎటు దారితీస్తుందోనని ఆందోళన
- ప్రభుత్వ పథకాలకు కొర్రీలు పెడతారేమోననే దిగులు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే' సమస్తం సందేహాలమయంగా మారింది. ఇంటింటికీ వెళ్లి సిబ్బంది సవాలక్ష ప్రశ్నలు సంధిస్తుండడంతో జనం భయపడుతున్నారు. ప్రశ్నావళిలో రూపొందించిన ప్రశ్నలకు జవాబులు చెప్పేందుకు ఇంటి యజమానులు సందేహిస్తున్నారు. ఏం సమాచారం చెబితే ఏం జరుగుతుందోనని జంకుతున్నారు. ఇప్పటికే తమకు అందుతున్న ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయా?.. కొత్త పథకాలు రాకుండా చేస్తారా?.. తమ వ్యక్తిగత సమాచారం బయటకు ఎందుకు చెప్పాలి?.. ఒక్క కుటుంబ సర్వేకే ఇన్ని ప్రశ్నలు అవసరమా?.. రైతుభరోసా, రుణమాఫీ వర్తింపజేసేందుకు కొర్రీలు పెడుతున్న సర్కారుకు ఇవన్నీ ఎందుకు? అనే సందేహాలు ఇంటి యజమానుల మెదళ్లను తొలుస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం సర్వేలోని వివరాలన్నీ పక్కాగా నమోదు చేయాల్సిందేనని చెబుతుండడంతో సిబ్బందికి తలకుమించిన భారంగా మారింది. మొత్తానికి సర్వే తొలిరోజే విభిన్న వర్గాల్లో తీరొక్క సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

-ఖమ్మం, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

బూర్గంపహాడ్‌లో సర్వే చేస్తున్న అధికారులు

సర్వేజనా సందేహాస్తు!

ప్రతి కుటుంబానికి సర్వే కోసం అరగంట సమయం కేటాయించాలి: కలెక్టర్

ఖమ్మం రూరల్: పెద్దతండాలో సర్వేను పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఉమ్మడి జిల్లాలో బుధవారం ప్రారంభమైంది. సర్వే నిర్వహణకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. ఇంటింటికీ వెళ్లి సర్వే సిబ్బంది సంధించే ప్రశ్నావళికి సంబంధించిన సమాధానాలు చెప్పేందుకు ఆయా కుటుంబసభ్యులు సందేహిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో సుమారు 6,33,304 కుటుంబాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి 3,654 ఎన్యూమరేషన్ బ్లాక్‌లు, 3,719 మంది ఎన్యూమరేటర్లు, 314 మంది సూపర్‌వైజర్లు, ఒక్కో నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. బుధవారం నుంచి మూడురోజులపాటు ఎన్యూమరేషన్ సిబ్బంది ఆయా ఇళ్లకు సంబంధించి లిస్టింగ్ పూర్తిచేసి ఆయా ఇళ్లకు సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను అంటించనున్నారు. ఒక్కో సర్వేయర్‌కు 150 ఇళ్లు కేటాయించారు. 15 రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తిచేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. అయితే ఈ సర్వేపై ప్రజల్లో సవాలక్ష సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ ప్రశ్నావళిలో 56 ప్రశ్నలు, 75 అంశాలతో సేకరించనున్నారు. ఇందులో వ్యక్తిగత సమాచారానికి సంబంధించిన ప్రశ్నలే ఎక్కువగా ఉండడంతో ఏది చెబితే ఏమి ప్రమాదమో, ఏ సంక్షేమ పథకానికి తమను అనర్హులు చేస్తారన్న భయం పేద, మధ్యతరగతి వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రతి కుటుంబానికి అరగంట సమయం కేటాయించి ప్రశ్నావళి రూపంలో ఆయా కుటుంబాల యజమానులకు పత్రాన్ని అందించి సమాధానం రాబట్టేలా ధానం ఇచ్చారు. ప్రతి కుటుంబానికి సర్వే కోసం అరగంట సమయం కేటాయించాలని, కచ్చితంగా సర్వేకు వస్తున్న సమాచారాన్ని ముందుగానే కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా ఖమ్మం నగరంలోని 53వ డివిజన్ ద్వారకా నగర్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వలంటరీ ప్రక్రియ మాత్రమేనని, ప్రజలను బలవంతం చేసి సమాచారం సేకరించడం ఉండదని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, కార్మిక శాఖ సహాయ కమిషనర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


కుటుంబ సమగ్ర వివరాలు నమోదు చేసే సర్వే ఫారం

సర్వేను రూపొందించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేగా ఈ సర్వేను పరిగణించనున్నారు. 15రోజులపాటు కంప్యూటరీకరణ పూర్తిచేసి నెలరోజుల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం రూపొందించిన సర్వే ఫార్మాట్‌లో కుటుంబ వ్యక్తిగత సమాచారానికి సంబంధించిన వివరాలే ఎక్కువగా అడుగుతుండడంతో వీటికి సమాధానం చెబితే ఏం జరుగుతుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొన్నది. సర్వే ఫార్మాట్ ప్రకారం.. కుటుంబ యజమాని, సభ్యులు సమాధానాలు ఇస్తే దాని అనుబంధ ప్రశ్నలకు సైతం సమాధానం ఇవ్వాల్సి ఉండడంతో సర్వే రూపంలో కుటుంబసభ్యులను ఇరకాటంలో పెట్టేవిధంగా ఉందన్న అభిప్రాయం పేద, మధ్యతరగతి వర్గాల్లో వ్యక్తమవుతున్నది. ప్రభుత్వం రూపొందించిన ప్రశ్నావళిలో మీరు ప్రస్తుతం ఏంచేస్తున్నారనే ప్రశ్న అడిగారు.. దీనికి అనుబంధంగా అలాగే వ్యాపారం, రియల్‌ఎస్టేట్, పారిశ్రామికవేత్త అయితే వారి వార్షిక టర్నోవర్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. అలాగే మీరు ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారా...? అని అడిగారు. ఒకవేళ ఆదాయపు పన్ను చెల్లిస్తున్నామని చెబితే సంక్షేమ పథకాలు భవిష్యత్‌లో వర్తింపచేస్తారో.. లేదో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆదాయం పన్ను రిటర్న్స్, ప్రస్తుత పరిస్థితుల్లో అనేక అవసరాలకు ఉదాహరణకు బ్యాంకు లోన్లు, ఇతరత్రా వాటికి ఆదాయపు పన్ను రిటర్న్స్ సర్వసాధారణం కాగా.. ఆదాయ పన్ను చెల్లిస్తున్నామని చెప్పడం వల్ల భవిష్యత్‌లో కలిగే ముప్పుపై సాధారణ ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుభరోసా ఇచ్చేందుకు, రుణమాఫీ వర్తింపజేసేందుకు ఈ తరహా అనేక నిబంధనలు పెట్టిన నేపథ్యంలో ఇప్పుడు కుటుంబ సర్వే ఆధారంగా తాము చెప్పిన సమాచారం తమ మెడకే చుట్టుకునే విధంగా ఉంటుందా అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ప్రశ్నావళిలో మీకు బ్యాంకు ఖాతా ఉందా? లేదా? అన్న ప్రశ్న ఇచ్చారు.

సర్వే కోసం ఇంటికి అంటించిన స్టిక్కర్

బస్సుల సంఖ్య పెంచాలి

- ఇల్లెందు డిపోలోనే డీజిల్ బంకు ఏర్పాటు చేయాలి
- ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడిపించాలి
- ఇల్లెందు ఆర్‌టీసీ డిపో ఎదుట మాస్‌లైన్ నేతల ధర్నా

ఆర్‌టీసీ ఇల్లెందు డిపో ఎదుట ధర్నా చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

ఇల్లెందు, నవంబర్ 6 : ప్రయాణికులకు తగిన విధంగా బస్సులు కేటాయించాలని, పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులు ఇవ్వాలని, డిపోలోనే డీజిల్ బంకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మాస్‌లైన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఇల్లెందు ఆర్టీసీ డిపో ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ, డివిజన్ సహాయ కార్యదర్శి బోస్ మాట్లాడారు. డిపోలో సరిపడా బస్సులు లేకపోవడంతో మారుమూల గిరిజన ప్రాంతాలకు బస్సులు నడపడం లేదని, ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డిపోను మరింతగా అభివృద్ధి చేసి అందులోనే డీజిల్ బంకు ఏర్పాటు చేయాలని, ఇల్లెందు నుంచి గుండాల మీదుగా పస్రా వరకు, ఇల్లెందు నుంచి వరంగల్, హైదరాబాద్ వరకు బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు బుర్ర వెంకన్న, పీవోడబ్ల్యూ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎదలపల్లి సావిత్రి, నాయకులు శేషయ్య, రంజాన్, గురునాథం, మల్లెల వెంకటేశ్వర్లు, సీతారాములు, పాండు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కళావతీబాయి

ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది..

సమయపాలన పాటించాలి

కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీలో ఖమ్మం జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతీబాయి

కొణిజర్ల, నవంబర్ 6: పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి బి.కళావతీబాయి సూచించారు. జిల్లా ఇమ్యునైజన్ అధికారి చందుతో కలిసి కొణిజర్ల పీహెచ్‌సీని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు ప్రసవించిన తర్వాత ఆరు నెలలపాటు శిశువులకు తల్లిపాలను పట్టించాలని సూచించారు. వాటిలోనే ఎన్నో పోషక విలువలు ఉంటాయని వివరించారు. ఆకుకూరలు తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గుతుందని, కంటిచూపు మెరుగుపడుతుందని చెప్పారు. డయాబెటిక్, క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన జబ్బులకు జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ లైన్ల ఏర్పాటుకు..

అనుమతులివ్వాలి

అటవీ శాఖ కార్యాలయం వద్ద పోడు రైతుల ధర్నా

చండ్రుగొండ ఫారెస్ట్ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న పోడు రైతులు

చండ్రుగొండ, నవంబర్ 6: తాము సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో విద్యుత్ లైన్ల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన పోడు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చండ్రుగొండలోని అటవీ శాఖ రేంజ్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోడు రైతులు మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వం తాము సాగు చేసుకుంటున్న భూములకు పోడు పట్టాలు ఇస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం విద్యుత్ లైన్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. వెంటనే లైన్ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అయితే, అటవీ భూముల్లో పోడు రైతులకు విద్యుత్ లైన్‌కు అనుమతులు లేవని రేంజర్ ఎల్లయ్య స్పష్టం చేయడంతో పోడు రైతులు నిరాశతో వెనుదిరిగారు. పోడు రైతులు మడివి రాజా, సున్నం శ్రీను, చీతం రామలక్ష్మి, జువాది వీరభద్రం, మడివి కృష్ణ పాల్గొన్నారు.

బోధనను గమనిస్తూ.. స్వయంగా బోధిస్తూ..


బోర్డుపై లెక్కలు చెబుతూ సందేహాలు నివృత్తి చేస్తున్న కలెక్టర్

- కొనసాగుతున్న ఖమ్మం కలెక్టర్ పాఠశాలల బాట..
- జలగంనగర్ పాఠశాలలో పాలనాధికారి తనిఖీ
- విద్యార్థులకు హితబోధ.. టీచర్లకు సూచనలు..

ఖమ్మం రూరల్, నవంబర్ 6: ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించిన ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.. తరచూ వాటిల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఉపాధ్యాయుల బోధనను గమనిస్తూ.. ఒక్కోసారి తానే స్వయంగా బోధిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో ఖమ్మం రూరల్ మండలంలో బుధవారం పర్యటించిన కలెక్టర్.. ఇక్కడి జలగంనగర్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరో తరగతి క్లాస్ రూంలోకి వెళ్లిన ఆయన.. అక్కడ ఉపాధ్యాయురాలు బోధిస్తున్న పాఠాలను విద్యార్థులతో కలిసి బెంచ్‌పై కూర్చొని విన్నారు. తదుపరి పీరియడ్‌లో తానే స్వయంగా గణితం మాస్టారై.. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా లెక్కలను చేసి చూపించారు. అనంతరం పిల్లలతో ముచ్చటించి.. బోధనా విధానం, పాఠశాలలోని సమస్యలు, కావాల్సిన వసతులు వంటి వివరాల గురించి తెలుసుకున్నారు. 'పెద్ద వాళ్లు అయ్యాక ఏం కావాలనుకుంటున్నారు?' అంటూ పిల్లలను అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తాము నిర్దేశించుకున్న గమ్యాలను ప్రతిరోజూ ఉదయం నిద్రలేవగానే డైరీలో రాసుకోవాలని, గమ్యాల సాధన దిశగా ప్రయాణాన్ని ఇప్పటి నుంచే ప్రారంభించాలని సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన..

పాఠశాల తనిఖీలో భాగంగా ప్రధానోపాధ్యాయుడు శ్యాంసన్‌కు కలెక్టర్ పలు అదేశాలు జారీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా రూ.8 లక్షలతో చేపట్టిన మరుగుదొడ్ల మరమ్మతులు, డైనింగ్ హాల్, కిచెన్ మొదలగు పనులను పరిశీలించారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేసి అవసరమైన విద్యుత్ సంబంధిత పనులను ఫేజ్-2, 3లలో చేపట్టేందుకు రూ.50 వేల చెక్కును హెచ్ఎంకు అందజేశారు.

ప్రశాంత వాతావరణం కల్పించాలి

- పోటీ పరీక్షలకు పుస్తకాలను అందుబాటులో ఉంచాలి
- జిల్లా గ్రంథాలయ సందర్శనలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్

జిల్లా గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 6: విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థులు, సీనియర్ సిటిజన్లు.. పుస్తకాలు, పత్రికలను చదువుకునేలా గ్రంథాలయంలో ప్రశాంత వాతావరణం కల్పించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా గ్రంథాలయాన్ని బుధవారం సందర్శించిన కలెక్టర్.. అందుబాటులో ఉన్న పుస్తకాలు, సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. 'పుస్తకాలు చదువుకోవడానికి శాశ్వత సభ్యత్వం ఎంత? విద్యార్థులకు ఇచ్చే పుస్తకాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారా? స్టోర్ రూమ్ కురుస్తోందా? మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు ఇతర సౌకర్యాలు ఉన్నాయా?' అని అడిగి తెలుసుకున్నారు. 'పుస్తకాలకు ఇన్ వార్డు నంబర్ ఉందా.? లేదా?' అని తనిఖీ చేశారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, దినపత్రికలు, నవలలు తదితరాలను విభజించి అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదనపు కలెక్టర్ విద్యాచందన, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, గ్రంథాలయ అధికారి నవీన్‌కుమార్, లైబ్రేరియన్ మణిమృదుల పాల్గొన్నారు.